31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

ఆదివారం,సెప్టెంబర్ 13 , 2026 పేజీలు : 8

## కరెంటు కోతలతో రైతులు కలవరపడుతున్నారు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 12 :** కరెంటు కోతలతో రైతులు కలవరపడుతున్నారని, రాష్ట్రంలో రైతుల పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి అన్నారు. శనివారం సారంగాపూర్ మండలం రేచపెల్లి గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరెంటు కోతలతో రైతులు కలవరపడుతున్నారని, గతంలో 24 గంటల విద్యుత్ ఇచ్చిన పరిస్థితి నుంచి ఇప్పుడు 12 గంటలు కూడా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితికి వచ్చారన్నారు. అల్పపీడనంతో వర్షం పడి బావుల్లో నీరు వచ్చింది. నీరు ఉంది, బావి ఉంది, మోటారు ఉంది, కానీ కరెంటు లేదు ఇదే రైతు ప్రధాన సమస్య అని అన్నారు. ఖరీఫ్ పంట చివరి దశలో ఉందని, పంట చేతికి వచ్చే వరకు ప్రభుత్వం అండగా ఉండాలని, రైతుకు రాజకీయ మాటలు కాదు సమయానికి కరెంటు, ఎరువులు, గిట్టుబాటు ధర, నష్టపోతే పరిహారం కావాలని డిమాండ్ చేశారు. రైతు బాగుంటేనే గ్రామం, రాష్ట్రం బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తేలు రాజు, సాగి సత్యంరావు తదితరులు పాల్గొన్నారు.

# ఖేలో ఇండియాలో పతకాలు సాధించాలి

### తెలంగాణను నంబర్ వన్‌గా నిలవాలి “అల్ఫోర్స్” నరేందర్ రెడ్డి




**చురకలు విలేఖరి కరీంనగర్, సెప్టెంబర్, 12 :** వచ్చే డిసెంబర్లో తెలంగాణలో జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో యోగా క్రీడాకారులు ఎక్కువ పథకాలు సాధించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో జరిగిన 17వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జూనియర్ బాలబాలికల యోగా పోటీల ముగింపు కార్యక్రమానికి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వతహాగా క్రీడాకారుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని దానిలో భాగంగా ప్రతిష్టాత్మక కేసులో ఇండియా పోటీలకు మన రాష్ట్రం ఆతిథ్యమిస్తుంది అన్నారు. యోగాతో పాటు మిగతా క్రీడలో రాణించి తెలంగాణను నంబర్ వన్ గా నిలపాలన్నారు. యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకు పరిచయం అయిందని రానున్న ప్రపంచ స్థాయి యోగా పోటీల్లో భారతదేశానికి తిరుగు లేదన్నారు. విద్యార్థి దశ నుంచి తమకు అభిరుచి ఉన్న క్రీడల్లో ప్రణాళిక బద్ధంగా నిత్య సాధన చేస్తేనే ఉన్నత స్థాయికి ఎదుగుతార న్నారు. కేవలం పాఠ్యాంశాల కే పరిమితం కాకుండా క్రీడల్లో భాగస్వాములు అయితే రిజర్వేషన్ ద్వారా విస్తృత ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రత్యేకించి సీబీఎస్ఈ లో అదనపు సబ్జెక్టుగా యోగాను ఎంపిక చేసుకునే అవకాశము ఉందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని తమ సాధించిన ప్రతిభను విశ్లేషించుకుని క్రీడాకారులు ముందుకెళ్లాలన్నారు. చదువులతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రస్థాయి పోటీలకు ఆల్ ఫోర్స్ ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ యోగాకు చిరునామాగా కరీంనగర్ నిలవడం ఆనందంగా ఉందన్నారు. గతంతో పోలిస్తే నేడు క్రీడల్లో సదుపాయాలు మెరుగయ్యాయని, ప్రతిభ ఉన్న ఆటగాడికి ప్రోత్సహించేందుకు ఎంతో మంది దాతలు ముందుకు వస్తున్నట్లు చెప్పారు. వివిధ జిల్లాలోని విచ్చేసిన క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు అల్ఫోర్స్ వేదికగా నిలవడం, అందుకు అనుగుణంగా చక్కటి భోజన వసతి సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. ఇక్కడ క్రీడాకారులు సాధించిన స్ఫూర్తితో జాతీయస్థాయి యోగాలో రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు సాధించి పెట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ స్వల్ప వ్యవధిలో ఘనంగా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించిన కరీంనగర్ జిల్లా యోగ అసోసియేషన్ ను ఆయన అభినందించారు. గతంతో పోలిస్తే యోగాలో క్రీడాకారుల్లో నైపుణ్యం గణనీయంగా అభివృద్ధి చెందిందని అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యమే లక్ష్యంగా క్రీడాకారులు సాధన చేయాలన్నారు.తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ సిద్ధారెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజులుగా రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన వెయ్యి మంది క్రీడాకారులతో చక్కటి యోగా పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. వరుసగా 17వ సారి కరీంనగర్ ఛాంపియన్గా నిలవడం ఇక్కడి క్రీడా ప్రతిభకు నిదర్శనం అన్నారు. ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా శిక్షణ పొందాలని అన్నారు

**ఓవరాల్ చాంపియన్ గా కరీంనగర్.**

కరీంనగర్ జిల్లా క్రీడాకారులు అద్వితీయ ప్రతిభ కనబరిచి వరుసగా 17వ సారి ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించడం విశేషం. సెకండ్ ఓవరాల్ చంపియన్షిప్ గా రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలో సంయుక్తంగా సాధించగా, మూడో స్థానంలో నిజామాబాద్ జిల్లా నిలిచింది. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథులు ట్రోఫీలతో పాటు వ్యక్తిగత మెడల్స్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జాతీయస్థాయి పోటీలో పతకం సాధించిన దీపక్, ఫెడరేషన్ బాధ్యుడైన మనోజ్ కుమార్ ను అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి జి. జనార్దన్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు టి. రమేష్ రెడ్డి, కన్న కృష్ణ, రాష్ట్ర యోగ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి కమలాకర్, జిల్లా యోగ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుంటి రామకృష్ణ, మనోజ్, స్వరూపాచారీ, గంగాధర్, కిష్టయ్య, మల్లేశ్వరీ, ఆనంద్ కిషోర్ ఀ వీణావాణి, పాల్గొన్నారు.

### కొత్తపల్లి--జగిత్యాల హైవేపై

# సీసీ కెమెరాల ఏర్పాటు

### రోడ్డు భద్రత, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదం



**చురకలు విలేఖరి, కరీంనగర్, సెప్టెంబర్, 12:** కొత్తపల్లి: ప్రజల భద్రత, రహదారి ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకమని లిఅదనపు డీసీపీ (అడ్మిన్) శ్రీ వెంకటరమణ రెడ్డి , అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి, రూరల్ ఏసిపి విజయ్ కుమార్ కొత్తపల్లి సీఐ బి.కోటేశ్వరరావు తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. కొత్తపల్లి--జగిత్యాల హైవేపై ప్రజల భద్రతను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థను ఆయన ప్రారం భించారు.ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి మరియు ఏసీపీ--రూరల్ విజయ్ కుమార్, కొత్తపల్లి సీఐ బి.కోటేశ్వర్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు ఀ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రధా న రహదారులు, హైవేలపై ఏర్పాటు చేసే సీసీ కెమెరాలు 24ఐ7 నిఘా, వాహనా ల కదలికల పర్యవేక్షణ, ప్రమాదాల గుర్తిం పు, నేరాలకు సంబంధించిన ఆధారాల సేకరణ వంటి అంశాల్లో ఎంతో ఉపయో గకరంగా ఉంటాయని తెలిపారు. ము ఖ్యంగా ప్రమాదాలు జరిగినప్పుడు -మిగతా 2లో

## నా ఇల్లు కూడా నిషేధిత జాబితాలో పెట్టారు





**చురకలు ప్రతినిధి, హుజురాబాద్ సెప్టెంబర్ 12:** తమ నివాసాలు భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయో లేదో ప్రజలు తక్షణమే తెలుసుకోవాలని హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సూచించారు. మాజీ మంత్రి హరీష్ రావు గారు 22ఏ అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన అనంతరం కౌశిక్ రెడ్డి శనివారం విలేకరులతో మాట్లాడారు. తాను 22 ఏ జాబితా పరిశీలించానని తన ఇల్లు సైతం 22ఏ జాబితాలో ఉన్నట్లు గుర్తించానని తెలిపారు. తన ఇల్లు నేను అమ్ముకోవాలనుకుంటే, లేదంటే బ్యాంకులో తనఖా పెట్టాలన్న ఇక వీలు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఇంటిని ఎందుకు 22ఏలో పెట్టారు అని అధికారులను ప్రశ్నిస్తే, ముఖ్యమంత్రి సోదరుడు కొండల్ రెడ్డిని కలవాలని అధికారులు చెబుతున్నారనీ .. అసలు తెలంగాణలో ఏం జరుగుతోంది?” అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. ఒక బాధితుడు సోమశేఖర్ రెడ్డి తన భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించాలని కోరగా, 30 శాతం కమిషన్ అడిగారని ఆరోపిస్తూ తన బాధను వ్యక్తం చేశారని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఈ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, తమ ఆస్తులు, భూములు 22ఏ జాబితాలో ఉన్నాయో లేదో వెంటనే తనిఖీ చేసుకోవాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సూచించారు. “ప్రజల ఆస్తులను రక్షించాల్సిన ప్రభుత్వం, వాటిపైనే కన్నేసే పరిస్థితి ఎందుకు వచ్చింది? మంత్రి పొంగులేటి, ముఖ్యమంత్రి కుటుంబం ప్రజల భూములపై కన్నేసి కబ్జా చేయాలని చూస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే పూర్తి స్పష్టత ఇవ్వాలి” ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

## లోక్ అదాలత్‌లో 479 కేసులు పరిష్కారం

**-దత్తత అవార్డు అందజేసిన జడ్జి జానకి**



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 12 :** లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని న్యాయమూర్తి వై. జానకి తెలిపారు. శనివారం ధర్మపురి కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 479 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా దత్తతకు సంబంధించిన కేసును ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించి అవార్డు జారీ చేశారు. భాగ్య తిరుపతి దత్తత తీసుకునే వారిగా,లావణ్య (దివంగత రమేష్) దత్తత ఇచ్చే వారిగా పేర్కొంటూ దత్తత అవార్డు జారీ చేశారు. అనంతరం న్యాయమూర్తి వై. జానకి సంబంధిత పక్షాలకు దత్తత అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జానకి మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతాయని తెలిపారు. కేసు సామరస్యపూర్వకంగా పరిష్కారం కావడంతో ఇరుపక్షాలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మామిడాల శ్రీకాంత్,లోక్ అదాలత్ సభ్యులు గడ్డం సత్యనారాయణ రెడ్డి,రౌతు రాజేష్, ఏజీపీ ఇమ్మడి శ్రీనివాస్,లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్,న్యాయవాదులు అప్పాల నిరంజన్ సంబరాజుల,కార్తీక్, కస్తూరి,శరత్ కుమార్,కలమడుగు కీర్తి, ఇంచార్జి సూపరిండెంట్ రేగుల చంద్రశేఖర్ పోలీస్ సిబ్బంది కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు మారుతి జన్మదినం




**చురకలు ప్రతినిధి మంథని, సెప్టెంబర్ 12 :** మంథని ప్రెస్ క్లబ్ లో సీనియర్ జర్నలిస్టు కొమురోజు మారుతి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం జర్నలిస్టులందరూ మారుతిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంకరి కుమార్, ఉపాధ్యక్షులు బర్ల సంపత్, ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, సహాయ కార్యదర్శి గంధం అంజిబాబు, కోశాధికారి తగరం రాజు, సీనియర్ జర్నలిస్టులు కొమురోజు చంద్రమోహన్, అంకరి ప్రకాష్, బాసాని సాగర్, లక్కాకుల నాగరాజు, సభ్యులు, వివిధ పత్రికల విలేకరులు పాల్గొని మారుతికి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ కాలంగా జర్నలిజం రంగంలో ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.

## పదోన్నతి పొందిన పోలీసు సిబ్బందికి సన్మానం



చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 12: పోలీసు శాఖలో సేవలందిస్తున్న మహ్మద్ నసీర్‌ఖాన్ ఏఎస్సైగా, మహ్మద్ సఫ్దర్ అలీ హామిద్ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా శనివారం వారిని టియుడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఇద్దరు పోలీసు సిబ్బందిని శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి అభినందించారు. వారి భవిష్యత్ సేవలు మరింత విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖలో పదోన్నతి ఉద్యోగుల కష్టపడి పనిచేయడం, విధి నిర్వహణ, సేవలకు లభించిన గుర్తింపుగా పలువురు పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అదబ్-ఎ-ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షుడు షోయబ్ ఉల్ హక్ తాలిబ్, పాత్రికేయులు షాహేరాజ్ ఉద్దీన్ మోసిక్, ఫజల్ బేగ్, షేక్ ఇసాక్ అలీ, నయీమ్ ఉద్దీన్, ముక్సర్ అలీ నేహాల్, బీఆర్ఎస్ నాయకుడు నయీమ్ ఉద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి--జగిత్యాల హైవేపై

# సీసీ కెమెరాల ఏర్పాటు

**మొదటి పేజీ తరువాయి..** సంఘటనకు సంబంధించిన దృశ్యాలను పరిశీ లించడం ద్వారా దర్యాప్తును వేగవంతం చేయడానికి వీలుంటుందని పేర్కొన్నారు. కొత్తపల్లి--జగిత్యాల హైవేపై ఏర్పాటు చేసిన కెమెరాల ద్వారా వాహనాల రాకపోకలను పర్యవేక్షించడం, అనుమానాస్పద కదలికలను గుర్తించడం, రోడ్డు ప్రమాదాలపై తక్షణ స్పందనకు సహకరించడం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలను గుర్తించడం వంటి చర్యలకు మరింత అవకాశం కలుగుతుందని తెలిపారు. ఆధునిక సీసీ కెమెరా వ్యవస్థలలో హై-రిజల్యూషన్ వీడియో రికార్డింగ్, రాత్రి వేళల్లో నిఘా, వాహనాల నంబర్ ప్లేట్‌లను గుర్తించే సాంకేతికత, నిరంతర పర్యవేక్షణ వంటి సదుపాయాలు ఉండటం వల్ల హైవేలపై భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని వివరించారు. ప్రజా సేవలో నిమగ్నమైన సమాజ హితమైన కార్యక్రమాలు చేస్తున్న నరేందర్ రెడ్డి ని వారు ప్రత్యేకంగా అభినందించారు మరియు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపట్టి సమాజానికి చేయూతని ఇవ్వాలని వారు కోరారు. డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా భద్రతకు తోడ్పడే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రహదారులపై ప్రమాదాలను తగ్గించడంతో పాటు ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా లభించే భద్రతను సద్వినియోగం చేసుకుంటూ, హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగించడం, వేగ నియంత్రణ పాటించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడం ద్వారా రహదారి భద్రతకు సహకరించాలని అధికారులు సూచించారు. సమాజ హితంగా సేవలు అందిస్తున్న నరేందర్ రెడ్డి గారిని పోలీసులు అందరూ అభినందించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ మరియు సూచన మేరకు వీటిని ఏర్పాటు చేయడం జరిగిందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మామిడి, పంట పొలాల్లో జోరుగా దాబాలు

**చురకలు విలేకరి, మల్లాపూర్, సెప్టెంబర్ 12 :** మల్లాపూర్ మండలంలోని ఓబులపూర్ గ్రామ శివారులో మందుబాబుల అవసరాలకు అనుగుణంగా మందు, విందులతో పాటు ఆటపాటలతో ప్రకృతిని ఆస్వాదించుకునే సరికొత్త పద్ధతిలో ఎలాంటి అనుమతులు లేకుండా దాబాల నిర్వాహకులు మామిడి, పంట పోలాల్లోనే జోరుగా దందాను మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిస్తూ వారు ఆడిందే ఆటపాటిందే పాటగా కోనసాగుతున్నాయి. ఇటీవల మండలంలో ఏకంగా కొందరు జిల్లా స్థాయి అధికారులు మద్యం, మాంసం విందులకు కేరాఫ్ అడ్రస్ గా దాబాలు నిలుస్తున్నాయనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. అయినప్పటికి సంబంధిత అధికారులు మామూలుగానే తీసుకుంటున్నారే తప్పా గ్రామస్తులు, మహిళా రైతులు



పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. నిరంతరంగా దాబాలు నడుస్తుడడంతో అర్ధరాత్రి ద్విచక్రవాహనాలు ప్రమాదాలు జరుగుతున్నా మూడో కంటికి తెలియకుండా దాబా నిర్వాహకులే మధ్యవర్తులతో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల సహకారంతో బాదితులను డబ్బులతో మభ్యపెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అసలే వర్షాలు సరిగ్గా లేక విద్యుత్ సకాలంలో రాక పోవడంతో రైతులు పంటలను పండించడానికి మహిళా రైతులను రేయింబవళ్లు పంట పోలాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన చెందుతుండగా ఈ దాబాలలో ఉండే మందుబాబులతో వారి భద్రతపై ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాదాలను నివారించి, మహిళా రైతులకు భద్రతను కల్పించి ఓబులపూర్ శివారులో మామిడి, పంట పోలాల్లో నిర్వహించే రెండు దాబాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# జగన్ మృతదేహానికి కొప్పుల ఈశ్వర్ నివాళి





**ఎండపల్లి, సెప్టెంబర్ 12:** ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం బీఆర్ఎస్ పార్టీ తాజా మాజీ మండల అధ్యక్షుడు సింహాచలం జగన్ అకాల మరణం పట్ల మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జగన్ మృతి వార్త తెలుసుకున్న ఆయన స్వగ్రామమైన గుల్లకోటకు చేరుకుని పార్థివదేహాన్ని సందర్శించారు. జగన్ భౌతికకాయానికి పూలమాల వేసి అశ్రు నయనాలతో నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ జెండాను పార్థివదేహంపై కప్పి పార్టీ తరఫున గౌరవం ప్రకటించారు. అనంతరం జగన్ అంతిమయాత్రలో పాల్గొన్న కొప్పుల ఈశ్వర్ స్వయంగా పాడె మోశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి జగన్ అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. జగన్ మృతి పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటని అన్నారు. ఈ కష్ట సమయంలో జగన్ కుటుంబ సభ్యులు, బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## జాతీయ లోక్ అదాలత్‌లో 2,543 కేసులు పరిష్కారం

**-బాధితులకు రూ.2.34 కోట్ల పరిహారం**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 12 :** నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో శనివారం మూడవ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సి.రత్న పద్మావతి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ అదాలత్‌లో 2వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి సునీత రవీంద్రరెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి సి.నాగేశ్వరరావు, 2వ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె.నికీషా, డిఎల్ఎస్ఏ కార్యదర్శి సరిత పాల్గొన్నారు. లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ క్లెయిమ్ కేసులను పరిష్కరించారు. ముఖ్యంగా 19 మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ క్లెయిమ్ కేసులను పరిష్కరించి రూ.2,34,80,000 పరిహారం బాధితులకు అందజేశారు.మొత్తం 2,543 కేసులు పరిష్కారం కాగా, ఇందులో సివిల్ కేసులు 34, క్రిమినల్ కేసులు 2,506, పీఎల్‌సీ కేసులు 3 ఉన్నాయి.

## గణేష్ చతుర్థి వేళ అప్రమత్తంగా ఉండండి

**-జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 12 :** గణేష్ చతుర్థి పండుగ సందర్భంగా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని టౌన్ సీఐ కరుణాకర్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని పిక్‌పాకెటర్లు, జేబు దొంగలు, ఆస్తి నేరస్తులు మొబైల్ ఫోన్లు, పర్సులు, విలువైన వస్తువులు దొంగిలించే అవకాశం ఉందని, ప్రత్యేక నిఘా ఉంచుతున్నామన్నారు.పూజా సామగ్రి కొనుగోలు సమయంలో మొబైల్‌ను షర్టు జేబులో పెట్టుకోవద్దని, మొబైల్, పర్సు సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు. దొంగతనం జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు జరగకుండా ఖాతాలను భద్రపరచుకోవాలని, మొబైల్‌లో స్క్రీన్ లాక్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు.మహిళలు పూజలకు వెళ్లి వచ్చే సమయంలో బంగారు ఆభరణాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇంట్లో విలువైన వస్తువులు ఉంటే లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు.

## మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 12 :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ధర్మపురి పట్టణంలోని 2వవార్డులో ధర్మపురి బిజెపి పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో వార్డు ప్రజల కోసం ఉచిత మట్టి గణపతి విగ్రహాల ప్రతి ఇంటింటా పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలు పూజించాలి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ, సంఘీ మాధవ్ ,జిల్లా ఎండోమెంట్ కో కన్వీనర్ కలకోట రాజు, బీజేవైఎం నాయకులు మండలోజి సూరజ్, కోడుగంటి కిరణ్, సోమిశెట్టి శివ సాయి, కాసారపు వెంకటేష్, నక్క అక్షిత్, సోషల్ మీడియా ఇన్చార్జ్ కాసెట్టి హరీష్, వాడ సభ్యులు పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రులు శాంతియుతంగా జరుపుకోవాలి

**-ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, సెప్టెంబర్ 12 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో శాంతియుతవాతావరణం లో జరుపుకోవాలని ధర్మపురి సీఐరాంనర్సింహారెడ్డికోరారు.వినాయక చవితి సందర్భంగా గణేశ్ మండపాల వెల్గటూర్ గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులతో వెల్గటూర్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.మండపాల వద్ద విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు, ఇతర విద్యుత్ పరికరాలను సురక్షిత ఏర్పాటు,విద్యుత్ వైర్లు నేలపై చెల్లాచెదురుగా ఉంచకుండా, పిల్లలకు అందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,దీపాలు, కొవ్వొత్తులు, విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా వినియోగించాలని, అత్య వసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు మార్గం ఖాళీగా ఉంచాలని,అధిక శబ్దంతో డీజేలు,లౌడ్‌స్పీకర్లు వినియోగించకుండా,ప్రభుత్వం నిర్దేశించిన సమయాలు, నిబంధనలను పాటించాలని,అసభ్యకరమైన పాటలు, నృత్యాలతో ఇతరులకు ఇబ్బంది కలిగించే కార్యక్రమాలు నిర్వహించ రాదని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఉత్సవ కమిటీ సభ్యులు,వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.గణేశ్ నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు నిమజ్జనం కోసం వెళ్లే సమయంలో వాహనాలపై పరిమితికి మించి వ్యక్తులను ఎక్కించరాదని, వాహనాలను నడిపే వారు మద్యం సేవించకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని,నిమజ్జనం సమయంలో చెరువులు, కుంటలు మరియు నీటి వనరుల వద్ద ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లరాదని,ఈత రాని వారు నీటిలోకి దిగరాదని,పిల్లలు,వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిమజ్జనం సమయంలో విద్యుత్ తీగలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన వాహనాలపై విగ్రహాలను సురక్షితంగా ఉంచి, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నియంత్రణలను పాటించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలన్నారు. నిమజ్జనం అనంతరం చెత్తాచెదారం, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను నీటి వనరుల్లో వేయకుండా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని,గణేశ్ నవరాత్రి ఉత్సవాలను సామరస్యంతో, ప్రశాంత వాతావరణంలో,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వహించు కోవాలని పోలీసు అధికారులు నిర్వాహకులకు సూచించారు.ప్రజలు,ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతి నిధులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# పర్యావరణ రక్షణ కోసం మట్టి విగ్రహాలనే వాడాలి

**- మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (12) :** గణేష్ ఉత్సవాలను పర్యావరణ హితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న మట్టి వినాయక విగ్రహలను శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారైన వినాయక విగ్రహాల నిమజ్జనం వల్ల చెరువులు, కుంటలు, నదులు కలుషితమవుతున్నాయని తెలిపారు. రసాయనిక రంగులు, ప్లాస్టర్ పదార్థాల ప్రభావంతో జలచరాలు, జీవవైవిధ్యం నష్టపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మట్టి విగ్రహాలు నీటిలో సహజసిద్ధంగా కలిసిపోవడం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని జరగదన్నారు.ప్రజలు, యువత, గణేష్ ఉత్సవ కమిటీలు పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి ఆదర్శంగా నిలవాలని కోరారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ఇలాంటి చర్యలు అవసరమన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బద్దం గోపి, ఏపీఎం కొమురయ్య,నాయకులు సింగని మారుతి, గుమ్మడి రాజ్ గౌడ్ , గ్రామ ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాల నిర్వహణపై మండపాల నిర్వాహకులతో పోలీసుల సమావేశం



**చురకలు ప్రతినిధి కోరుట్ల,సెప్టెంబర్,12 :** రాబోయే గణేష్ ఉత్సవాల నేపథ్యంలో కోరుట్ల పట్టణంలోని గణేష్ మండపాల నిర్వాహకులతో మెట్‌పల్లి డీఎస్పీ రాములు ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ రాములు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖకు నిర్వాహకులు పూర్తిగా సహకరించాలని కోరారు.మత సామరస్యం,శాంతిభద్రతలను కాపాడుతూ గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో కోరుట్ల సీఐ కే. లక్ష్మీనారాయణ, ఎస్ ఐ. శ్యామ్ రాజ్, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, డీఈ జి. మధుసూదన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, పోలీస్ సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అలరించిన రామకృష్ణ విద్యార్థుల స్వాగతోత్సవాలు



**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 12 :** జగిత్యాల పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు ఎస్పీరంజా 2K26 పేరిట నిర్వహించిన స్వాగత ఉత్సవాలు ఉత్సాహభరితంగా సాగాయి.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియా,డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి కెరీర్‌పైనే దృష్టి పెట్టాలని,ఉన్నత లక్ష్యాలతో ప్రణాళికాబద్ధంగా విజయాలు సాధించాలని సూచించారు. సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కౌన్సిలింగ్‌తో వృద్ధుల కేసులు పరిష్కారం



**చురకలు విలేకరి, జగిత్యాల,సెప్టెంబర్ 12 :** జిల్లాలోని జగిత్యాల, మెట్ పల్లి, కోరుట్ల డివిజన్ల మండలాలకు చెందిన నిరాధరణకు గురవుతున్న వృద్ధ తల్లి దండ్రుల ఫిర్యాదులపై వారి కొడుకులు,కూతుర్లు,కోడళ్ళను శనివారం కౌన్సిలింగ్ కేంద్రం కు పిలిపించి తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు వృద్ధుల చట్టం శిక్షలను,వారు తల్లి దండ్రుల నుంచి పొందిన ఆస్తులు తిరిగి వారి పేరిట మార్చే వీలుందని వివరిస్తూ కౌన్సిలింగ్ చేయడంతో వారు స్పందించి తమ తల్లి దండ్రులను పోషణ,రక్షణ బాగోగులు మా భాద్యతేనని అఫిడవిట్స్ సమర్పించి వెంట తీసుకెళ్లారు.తమ సమస్యలు పరిష్కరించిన హరి అశోక్‌కుమార్ కు ఆ వృద్ధ తల్లి దండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కౌన్సిలింగ్‌లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్,ప్రతినిధులు పి.సీ.హన్మంత్ రెడ్డి,గౌరిశెట్టి విశ్వనాథము, వెల్ముల ప్రకాష్ రావు,ఎం.డి.యాకూబ్,కండ్ల గంగాధర్,విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

**- వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశంలో ఇబ్రహింపట్నం ఎస్ఐ నవీన్ కుమార్**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (12) :** గ్రామలలో వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల ఎస్ఐ నవీన్ కుమార్ సూచించారు. శనివారం మండలం లోని ఎర్దండి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వినాయక మండపాల నిర్వాహకులు, యువకులతో ఎస్ ఐ సమావేశం నిర్వహించి పండుగ ఏర్పాట్లపై చర్చించారు.ఈ సందర్భంగా ఎస్ఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు భక్తి, ఆనందోత్సాహాల మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని కోరారు. యువత అనవసర వివాదాలు,గొడవలకు దూరంగా ఉండి పరస్పర సహకారంతో పండుగను విజయవంతం చేయాలని సూచించారు. ఆవేశపూరిత చర్యలకు పాల్పడి తమ భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హెచ్చరించారు.పండుగ సందర్భంగా చట్టాలు, నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని, శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామంలో సామరస్య వాతావరణాన్ని నెలకొల్పి వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కల్లెడ గంగాధర్, వార్డు సభ్యుడు కల్లెడ నవీన్, గుజ్జరి సుభాష్, కారోబార్ రతన్, వినాయక మండపాల నిర్వాహకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**-మాజీ మంత్రి జీవన్ రెడ్డి**

**చురకలు విలేకరి, మల్యాల, సెప్టెంబర్ 12 :** అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. మల్యాల మండల కేంద్రానికి చెందిన గుండేటి కవిత అప్పుల బాధతో కుమారుడితో కలిసి ఆత్మహత్య చేసుకోగా శనివారం మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషిస్తున్న కవిత ఫైనాన్స్ అప్పుల ఒత్తిడితోనే ఆత్మహత్య కు పాల్పడిందని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం అందించాలని,మహిళా సంఘం నుంచి ఆర్థికసాయం అందించి తీసుకున్న రుణం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.మృతురాలి కుమారుడు నిఖిలేష్ చదువుకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని,ప్రైవేట్ పాఠశాల లో ఫీజు మాఫీ చేయాలని యాజమాన్యానికి సూచించామన్నారు. పీడీ రఘువరన్‌తో ఫోన్ లో మాట్లాడి బీమాకింద రూ.10లక్షలు ఇప్పించాలని ,సీఐ రాజ్‌కుమార్‌తో మాట్లాడి ఆత్మహత్యకు కారణమైన హిందూజా ఫైనాన్స్ కంపెనీపై చర్యలు తీసు కోవాలని, కుటుంబానికి బెదిరింపులు లేకుండా చూడాలని కోరినట్లు తెలిపారు.



# బలవన్మరణానికి పాల్పడ్డ మండల బిఆర్ఎస్ నేత

**-ఉమ్మడి వెల్గటూర్ మండలంలో విషాదం**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, సెప్టెంబర్ 12 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ ఉమ్మడి మండలం గుల్లకోట మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సింహాచలం జగన్ శనివారం తెల్లవారు జామున స్వంత ఇంట్లో ఊరేసుకొని బలవన్మ రణానికి పాల్పడ్డ సంఘటన వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆర్ఎంపివైద్యుడిగా గ్రామంలో సేవలందిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంచుకొని ప్రజాసేవ చేయాలన్న తపనతో మొదట తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా చేరి మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్న జగన్ సర్పంచ్ ఎన్నికల్లో గెలిచి అనంతరం బిఆర్ఎస్ పార్టీలో చేరగా పార్టీ మండల అధ్యక్షునిగా ఎంపికయ్యి సర్పంచుతో పాటు పార్టీ బాధ్యతలు నిర్వహించడంతో ఖర్చులు పెరిగి అప్పులు చేస్తూవచ్చాడు. మరోసారి పదవీకి పోటీ చేసే అవకాశం వచ్చినాపార్టీ ఆదేశాల మేరకు విరామించుకున్నారు.దీనితో పార్టీకోసం నిరంతరంపాటుపడేక్రమంలోమరిన్నిఅప్పులు చేయడం మధ్యతరగతి కుటుంబం కావడం సర్పంచ్ అయినప్పటి ఏదోఒకరోజు అవకాశం వచ్చి పదవులు లభిస్తాయనే ఆశతో అహర్నిశలు పార్టీ కోసం పాటుపడి కుటుంబాన్ని పోసించు కోలేని పరిస్థితికి దిగజారి అప్పుల పాలై పదవులు రాక,అప్పులు కుప్పలు తెప్పలై ఈఎంఐలు కట్టలేక అప్పుల భారంతో ఇబ్బంది పడుతూ బలవన్మరణానికి పాల్పడి ఆలిపిల్లలను అనాదలను చేసి ఈలోకాన్ని విడిచి వెళ్లారు. ఆత్మహత్యకు ముందు వాట్సప్ ద్వారా వెల్లడించిన ఆయన దీనగాద పలువురు కన్నీటి పర్యంతం చేసింది. మధ్యతరగతికి చెందిన యువకుడు ప్రజాసేవ దృకృతంతో రాజకీయాల్లోకి వస్తే ఎలాంటి పరిస్థితి ఉందో ఈ యువనేత జీవితగాథఅద్ధం పడుతుంది. పదవుల ఆశతో మండల, గ్రామ స్థాయి లో పార్టీ జెండాలు మోసే నాయకుల పరిస్థితి ప్రస్తుతం ఇలాగే ఉందనిచెప్పకతప్పదు. డబ్బుతో ముడిపడిన నేటి రాజకీయాల్లో మధ్యతరగతి కుటుంబాల విద్యా వంతులు ప్రజాసేవ చేయాలానే ఉద్దేశం ఉన్నా అది అందని ద్రాక్షగానే మిగిలిపోయే పరిస్థితి.చాలామంది మధ్య తరగతికి చెందిన క్రిందిస్తాయి నాయకులపరిస్థితి ఇదే,ఒకవేళ ప్రజల మన్ననలు పొంది గెలిచినా నేటి పరిస్థితి లో మండల, గ్రామ స్తాయి నాయకులకు ఎలాంటి పవర్స్ ఉపయోగించే పరిస్థితి లేదు. ఏదైమైనా వార్డుసభ్యునిగా, సర్పంచుగా,పార్టీ మండల బాధ్యతలు నెరవేరుస్తూ అప్పులపాలై కుటుంబాన్ని అనాథగా మార్చి బలవన్మరణానికి పాల్పడిన మండల నాయకుడి దీనగాథ వింటే నేటి రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుస్తుంది. తెలుగుదేశం పార్టీలో నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరి కొన్నేళ్లుగా రాజకీయ ప్రస్థానం లో పార్టీ, ప్రజలకోసం పని చేసిన జగన్ కు ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం విచారకరం. అప్పులపాలై ఈఎంఐ లు కట్టలేని పరిస్థితికి దిగజారి ఆత్మహత్యకు పాల్పడడం ప్రజలను కలిచివేసింది. ఇద్దరు చిన్నారి పిల్లలు, భార్యను అనాదలనుచేసిఆయనతనువు చాలించిన సంఘటన హృదవిదారకం. బిఆర్ఎస్ పార్టీకోసం అహర్నిశలు కృషిచేసిన ఆయన కుటుంబాన్ని అన్నివిధాలు గా ఆదుకోవలసిన బాధ్యత పార్టీ పై ఉంది. ఆయన తన పిల్లలు కుటుంబాన్ని ఆదుకోవాలని పార్టీ నాయకులను, బందు, మిత్రులను వేడుకొంటూ వ్యాట్సాప్ ద్వారా వేడుకొన్న తీరు పలువురిని కట్టతడి పెట్టిస్తుంది. శనివారం పెద్దఎత్తున పార్టీనాయకులు అభిమానులు,మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మృతుడు జగన్ అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసి ఘన నివాళులు అర్పించారు. కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

# మట్టి గణపతిని పూజిద్దాం..పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

**-వాసవి వరల్డ్ స్కూల్‌లో మట్టి గణపతిపై అవగాహన కార్యక్రమం**



**చురకలు ప్రతినిధి,నిర్మల్, సెప్టెంబర్, 12 :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కేంద్రంలోని వాసవి వరల్డ్ స్కూల్‌లో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో మట్టి వినాయకుల తయారీ కార్యక్రమాన్ని శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ స్వయంగా మట్టితో వివిధ ఆకృతుల్లో అందమైన వినాయక విగ్రహాలను తయారు చేశారు. ప్రకృతికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా పర్యావరణ హితమైన మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు ఎంతో ఆసక్తిగా కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు సంప్రదాయాల పట్ల గౌరవం, పర్యావరణ పరిరక్షణపై బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం పెంపొందుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది."మట్టి గణపతిని పూజిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం"అనే సందేశాన్ని విద్యార్థులు అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ జగదీష్ రెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, ప్రిన్సిపల్.శైలజాయ్ సన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నారాయణపేటలో అగ్నిమాపక అధికారి

# ఖర్దుంగ్‌లా పర్వతాల్లో పరుగుల విజేత

**-17,965 అడుగుల ఎత్తులో 13 గంటల్లో 72 కి.మీ. ఖర్దుంగ్ లా ఛాలెంజ్ పూర్తి చేసిన జీవీ ప్రసాద్**






**చురకలు ప్రతినిధి,వరంగల్ సెప్టెంబర్ 12 :** నారాయణపేట జిల్లా అగ్నిమాపక కేంద్రంలో DFO గా విధులు నిర్వర్తిస్తూ.. పరుగుల ప్రపంచంలో సరికొత్త రికార్డులను సొంతం చేసుకుంటున్నారు జీవీ ప్రసాద్. ప్రజల ప్రాణాలను రక్షించే బాధ్యతలో నిరంతరం అప్రమత్తంగా ఉండే ఆయన.. తాజాగా లడాఖ్‌లో సముద్ర మట్టానికి 17,965 అడుగుల (5,476 మీటర్లు) ఎత్తులో ఉన్న ఖర్దుంగ్ లా పర్వత ప్రాంతంలో నిర్వహించిన 72 కిలోమీటర్ల ఖర్దుంగ్ లా ఛాలెంజ్--2026ను 13 గంటల్లో విజయవంతంగా పూర్తి చేసి అరుదైన ఘనత సాధించారు.అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో నిర్వహించే కఠినమైన పరుగుల్లో ఖర్దుంగ్ లా ఛాలెంజ్ ఒకటి. తక్కువ ఆక్సిజన్, చలి వాతావరణం, కఠినమైన పర్వత మార్గాలు రన్నర్ల సామర్థ్యానికి పెద్ద సవాల్‌గా నిలుస్తాయి. అలాంటి పరిస్థితులను అధిగమిస్తూ ప్రసాద్ ఈ సవాల్‌ను పూర్తి చేశారు.

**లడాఖ్ మారథాన్‌తో అర్హత**

ఖర్దుంగ్ లా ఛాలెంజ్‌కు ముందు జీవీ ప్రసాద్ లడాఖ్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. సముద్ర మట్టానికి సుమారు 11,500 అడుగుల ఎత్తులో ఉన్న లడాఖ్‌లో 42.20 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేయడం ద్వారా ఖర్దుంగ్ లా ఛాలెంజ్‌లో పాల్గొనే అర్హత సాధించారు.

**'ప్రోకామ్ స్లామ్'లోనూ ఘనత**

2024-25లో ప్రోకామ్ స్లామ్‌లో భాగంగా బెంగళూరులో 10 కి.మీ., ఢిల్లీలో 25 కి.మీ., కోల్‌కతాలో 25 కి.మీ., ముంబైలో 42.20 కి.మీ. రేసులను విజయవంతంగా పూర్తి చేశారు. వివిధ రేసుల్లో ఇప్పటివరకు 50 పతకాలు సాధించారు.

**డీజీ అభినందనలు**

ఈ అరుదైన విజయంపై తెలంగాణ అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ శ్రీ విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్ గారు అభినందనలు తెలిపారు.

# టీబీ బాధితులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ సెప్టెంబర్ 12 :** క్షయ వ్యాధి (టీబీ)తో బాధపడుతున్న వారికి పౌష్టికాహారం అందించడం అభినందనీయమని అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కవ్వంపల్లి అనురాధ అన్నారు. ఇటీవల మానకొండూరు పీ.హెచ్.సీలో క్షయ వ్యాధి పీడితులుగా నమోదైన వారికి మాధవి సీడ్స్ అధినేతలు రేమిడి శ్రీనివాసరెడ్డి--సత్యవతి దంపతులు పౌష్టికాహార కిట్లను అందించారు.శనివారం మానకొండూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ అనురాధ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధి సోకిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీకి సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని, వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా మందులు వినియోగించుకోవాలని సూచించారు. టీబీ బాధితులు మందులతో పాటు బలవర్ధకమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. టీబీ బాధితులకు నిత్యావసర సరుకులతో కూడిన పౌష్టికాహార కిట్లను అందించిన రేమిడి శ్రీనివాసరెడ్డి--సత్యవతి దంపతులను డాక్టర్ అనురాధ అభినందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, ప్యాక్స్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, గంగుల రామిరెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, తిరుమలరెడ్డి, బుర్ర శ్రీధర్ గౌడ్, మడుపు ప్రేమ్‌కుమార్, కొండ్ర సురేష్, రేవెల్లి రాజలింగం, కనకం అశోక్, గొల్లెన కొమురయ్య, ఎన్. బాపురావు, బాకారపు సమ్మయ్య, ఎడ్ల శ్రీధర్, బుర్ర శ్రీకాంత్, బిక్కారెడ్డి,దూలం దేవేంద్ర, దూలం వీరస్వామి, ఎర్రోళ్ల కవిత, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## బీసీ హక్కుల సమితి నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా టి.ఆర్.ప్రసాద్



**చురకలు ప్రతినిధి,నిర్మల్, సెప్టెంబర్, 12 :** తెలంగాణ బీసీ హక్కుల సమితి (రిజి. నం. 635/2019) నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా తొగిటి.రామ్ ప్రసాద్ ను నియమించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యస్. నరసింహావారి తొగిటి.రామ్ ప్రసాద్‌ను ఈ బాధ్యతలకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ జిల్లాలో బీసీల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం సమితి ఆధ్వర్యంలో సమర్థవంతంగా పనిచేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఆకాంక్షించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన తొగిటి.రామ్ ప్రసాద్ కు పలువురు నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.కొత్త బాధ్యతల్లో ఆయన విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

## శ్రావణ మాస నెలరోజుల శివుడికి ప్రత్యేక అభిషేకాలు పూర్తి



**చురకలు ప్రతినిధి,నిర్మల్, సెప్టెంబర్, 12 :** శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పరమశివుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఓం నమఃశివాయ నామస్మరణతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, కామారెడ్డి జిల్లాల్లో శివారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల రోజుల పాటు శివుడికి రుద్రాభిషేకం, బస్మారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి స్వామివారి కృపను పొందారు. నిర్మల్‌లోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆమెడ.శ్రీధర్, మాజీ దేవరకొండ చైర్మన్ చిన్నయ్య పూర్వక, పద్మల.శివ,ఎంజీ.రాకేష్ తదితరులు పాల్గొన్నారు. పరమశివుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## మధు యాష్కిని ఘనంగా సన్మానించిన జువ్వాడి కృష్ణారావు



**చురకలు ప్రతినిధి కోరుట్ల, సెప్టెంబర్ 12 :** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా నియమితులైన మాజీ లోక్‌సభ సభ్యుడు మధు యాష్కిని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు శనివారం ఘనంగా సన్మానించారు. ఏఐసీసీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా నియమితులైన అనంతరం తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చిన మధు యాష్కిని ఆయన నివాసంలో జువ్వడి కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధు యాష్కికి శాలువా కప్పి ఘనంగా సన్మానించడంతో పాటు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జువ్వడి కృష్ణారావు మధు యాష్కికి అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## చింతకుంటవాడలో విద్యుత్ స్తంభాల ఆధునీకరణ పనులు



**చురకలు ప్రతినిధి,నిర్మల్, సెప్టెంబర్, 12 :** నిర్మల్ పట్టణంలోని చింతకుంటవాడలో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన పాత విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన సిమెంట్ విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేపట్టారు. 1956లో ఏర్పాటు చేసిన పాత విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరడంతో పాటు రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో వాటిని తొలగించి, వాటి స్థానంలో నూతన సిమెంట్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల.కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆధ్వర్యంలో, స్థానిక 40వ వార్డు కౌన్సిలర్ అడప.విజయలక్ష్మి పోశెట్టి సమన్వయంతో ఈ పనులు కొనసాగుతున్నాయి. రాబోయే వినాయక శోభాయాత్రలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పాత విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గంద్రత్.వెంకటరమణ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంద్రత్.రమేష్, లక్కడి.జగన్ మోహన్, విద్యుత్ శాఖ అధికారులు, వార్డు పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహం కోసం... స్నేహితుని కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సహాయం

**-1990 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థుల ఔదార్యం**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 12 :** తమతో కలిసి చదువుకున్న మిత్రుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి 1990 ఎస్ఎస్సి బ్యాచ్ హుజురాబాద్ ప్రభుత్వ హైస్కూల్ స్నేహితులు అండగా నిలిచారు. పట్టణంలోని శివాలయం ప్రాంతానికి చెందిన చెందిన ముల్కనూరి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తమతో కలిసి చదువుకున్న మిత్రుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు అతని స్నేహితులు ముందుకొచ్చారు. మానవతా దృక్పథంతో కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. సత్యనారాయణ అకాల మరణం పట్ల మిత్రులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఆయన కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. మిత్రుడి కుటుంబానికి భవిష్యత్తులోనూ తమ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి రతన్ ప్రసాద్, నంబి భరణి కుమార్, ముప్పిడి నాగరాజు, అపరాజ ప్రసాద్, తాళ్లపెల్లి శ్రీనివాస్, భూసారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ ప్రభుత్వం

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ సెప్టెంబర్ 12 :** అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ ప్రభుత్వం అని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 18 వ డివిజన్ కార్పొరేటర్ దేవనపల్లి చక్రపాణి అన్నారు. 8వ కాలనీ 18 డివిజన్ కార్పొరేటర్ దేవనపల్లి చక్రపాణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ . మరియు మేయర్ మహంకాళి స్వామి ఆదేశాల మేరకు శనివారం 18వ డివిజన్ కార్పొరేటర్ దేవనపల్లి చక్రపాణి ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించబడును.కాంగ్రెస్



ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, గృహ జ్యోతి, చేయూత వంటి పథకాలను అమలు చేస్తోంది. ఈ సంక్షేమ ఫలాలు ప్రతి అర్హుల కుటుంబానికి చేరేలా కాంగ్రెస్ పార్టీ గడపగడపకు వస్తోంది.ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అభివృద్ధి మరియు సంక్షేమం ప్రతి ఇంటికి చేరేలా కృషి చేయాలని.. ఈ ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధి, సేవే లక్ష్యంగా శ్రమిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ నాయకత్వం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు టౌన్ ప్రెసిడెంట్ గుండేటి రాజేష్. జక్కుల దామోదర్. పోగుల వీరారెడ్డి. మోత్కు అవినాష్. మారం కుమార్ యాదవ్. మార్కరాజు . ఇరికి మహేష్ . పరకాల ప్రశాంత్ . బూర్ల సంపత్. నాగవెల్లి శంకర్ . మరియు డివిజన్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యల పరిష్కారంలో గెలిచిన సంఘాలు విఫలం

**- టిబిజికెఎస్ ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య**

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ సెప్టెంబర్ 12 :** సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘాలు విఫలమయ్యాయని టీబీజీకేఎస్ అర్జీ త్రీ ఉపాధ్యక్షుడు నాగేలి సాంబయ్య ఆరోపించారు. శనివారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆర్జీ 3 ఏపీఏ ఏరియా ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య ఈరోజు ఉదయం 7:00ల షిఫ్ట్ సమయంలో ఏఎల్‌పి గని కార్మికులను మ్యానువే వద్ద కలవడం జరిగింది. ఈ సందర్భంగా కార్మికుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది.కనీసం డ్రిల్ బిట్స్, పనిముట్లు లేని పరిస్థితుల్లో కార్మికులు పని చేయవలసి వస్తుందని.రక్షణ పరికరాలైనా షూస్, గ్లౌస్ సకాలంలో



అందించడం లేదని,వెంటిలేషన్ సరిపడా లేదని,పని స్థలాలు మెరుగు పరచడం లేదని ఇంకా పలు సమస్యలు తెలుపుతూ కార్మికులు వాపోయారు. అనంతరం నాగేల్లి సాంబయ్య గారు మాట్లాడుతూ పై సౌకర్యాలు కల్పించడంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని, డిస్మిస్ ల పేరా కార్మికులను వేధించడం సరైనది కాదని, మెడికల్ బోర్డుల కోసం సీనియర్ కార్మికులు ఎదురుచూస్తున్నారని, కార్మికులకు అండగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉంటుందని అన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో కేంద్ర సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇసంపల్లి రమేష్, కేంద్ర కమిటీ నాయకులు దేవ శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, గని ఫిట్ సెక్రటరీ వి.వి గౌడ్ , పూసల శేఖర్,పాశం శ్రీనివాసరెడ్డి, పేర్క రమేష్, దాసరి మల్లేష్, కొప్పుల సురేష్, పిట్టల సది , రెండ్ల సందీప్, రాజేష్, వెంకటేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

**-మల్యాల సిఐ మాదాసు రాజ్ కుమార్**

**చురకలు విలేఖరి,పెగడపల్లి, సెప్టెంబర్ 12 :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని,వినాయక నవరాత్రి ఉత్సవాల మండపాల వద్ద నియమ,నిబంధనలు పాటించాలని మల్యాల సిఐ మాదాసు రాజ్ కుమార్ ప్రజలకు సూచించారు. జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి పోలీస్ స్టేషన్ లో గణేష్ నవరాత్రి ఉత్సవ మండపాల నిర్వాహకులతో,ప్రజా ప్రతినిధులతో,యువతతో శనివారం ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మల్యాల సిఐ రాజ్‌కుమార్ శాంతియుత సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ రాజ్ కుమార్ మాట్లాడుతూ... ప్రజలందరూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా,భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని,ఉత్సవ నిర్వాహకులు




ప్రతి మండపాల యొక్క వివరాలను ఆన్లైన్ చేసి,పోలీస్ స్టేషన్లో వివరాలను సమర్పించాలని తెలిపారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని, విద్యుత్ విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని,నిమర్జనం రోజున ఎలాంటి గొడవలకు పాల్పడకూడదని, శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని మల్యాల సీఐ హెచ్చరించారు.గ్రామాల్లో ఎలాంటి గొడవలు,అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజా ప్రతినిధులు,యువత చొరవ తీసుకోవాలని,శాంతి భద్రతల విషయంలో గణేష్ నవరాత్రి మండపాల నిర్వాహకులు, ప్రజలు, యువత పోలీసు వారికి సహకరించాలని ఈ సందర్భంగా సిఐ కోరారు.గణేష్ నిమర్జనం సందర్భంగా ఈత వచ్చిన వారే నిమర్జనంలో పాల్గొనాలని మల్యాల సిఐ రాజ్ కుమార్ సూచించారు. శాంతియుత సమావేశంలో పెగడపల్లి ఎస్ఐ కిరణ్ కుమార్,పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, ఆయా గ్రామాల సర్పంచులు, యువత మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి ఎస్ఐ కిరణ్ కుమార్, ఎలక్ట్రిసిటీ లైన్ ఇన్స్పెక్టర్ బాలు నాయక్, ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కదారి తిరుపతి, ఆయా గ్రామాల సర్పంచులు ఒరుగల అరుణ - శ్రీనివాస్, వెల్మ బలరాం రెడ్డి, మ్యాక సుధాకర్ రెడ్డి, పులి రాజేశం, జీలా రాకేష్ యాదవ్, మోకెనపల్లి గోపాల్, కేశవేణి కుమార్, రాచకొండ ఆనంద్, ఉప సర్పంచులు ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి, బత్తుల ప్రదీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మ్యాకల మల్లయ్య, కుంటాల శ్రీనివాస్, చిన్న తిరుపతి, పూసాల తిరుపతి తడగొండ రాజు, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, పోలీస్ సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనివాస్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ప్రతి కార్యకర్తకు స్ఫూర్తి

**-ప్రజల మధ్య ఉంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలి**

**-బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 12 :** గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన ప్రజాసేవా ప్రస్థానం నుంచి భారత ప్రధానమంత్రిగా 25 ఏళ్లుగా నిరంతరం ప్రజాసేవ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ సేవా ప్రస్థానం ప్రతి బీజేపీ కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో 'సేవా సంకల్ప్ అభియాన్'జిల్లా కార్యశాల నిర్వహించారు. సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా ఇన్చార్జి గంగాడి మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ శ్రేణులకు రానున్న కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు దాదాపు నెల రోజుల పాటు రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో తొమ్మిది ప్రధాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొని ప్రజాక్షేత్రంలో నిరంతరం ఉండాలని సూచించారు. ప్రజల మధ్య ఉంటూ పనిచేసే కార్యకర్తలే భవిష్యత్తులో నాయకులుగా ఎదుగుతారని అన్నారు. ప్రతి కార్యకర్త గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, వాటి పరిష్కారం కోసం పోరాడాలని గోపి పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ అప్పగించిన కార్యక్రమాలను సమన్వయంతో, క్రమశిక్షణతో విజయవంతం చేయాలని కోరారు.బీజేపీ కార్యక్రమాలను అంకితభావంతో నిర్వహిస్తూ ప్రజల్లో పార్టీకి మరింత ఆదరణ పెంచాలని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం దూరం కాదని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లోనూ బీజేపీ జెండా ఎగురవేసేలా ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు బీజేపీలో రాజకీయంగా ఎదగడానికి మంచి అవకాశాలు ఉన్నాయని గోపి తెలిపారు. ప్రజాక్షేత్రంలో నిరంతరం పనిచేసే కార్యకర్తలే భవిష్యత్తులో నాయకులుగా ఎదుగుతారని పేర్కొన్నారు.

**పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలి.**

జిల్లా ఇన్చార్జిగంగాడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ..పార్టీ ఇచ్చిన నెల రోజుల కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమయాన్ని కేటాయించి క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు.కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తగిన గుర్తింపు,అవకాశాలు లభిస్తాయని భరోసా ఇచ్చారు.మోదీ 25ఏళ్ల ప్రజాసేవా స్ఫూర్తితో ప్రతి కార్యకర్త ప్రజల కోసం పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్,కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ దశరథం రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు బర్కం లక్ష్మి, శీలం రాజు, మల్లారపు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మిస సంజీవ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఉడుగుల యాదగిరి,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్‌తో పాటు రాష్ట్ర, జిల్లా పదాధికారులు,వివిధ మండలాల అధ్యక్షులు,మండల పదాధి కారులు ,ప్రజాప్రతినిధులు,బీజేపీ సీని యర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

**-మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం**

**-డీజే లు వద్దు భజనలతో పూజలు చేద్దాం**

**-వి.ఎస్.ఎస్.ఎస్ చైర్మన్ డా, సురభి శ్రీధర్**




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 12 :** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ అన్నారు. గణపతి నవరాత్రుల భాగంగా గణపతి విగ్రహాలను ప్రతిష్టింపజేసి నవరాత్రులు ఘనంగా పూజలు, అభిషే కాలు, హటరీమాలు, నిర్వహించడం జరుగుతుందని. తెలిపారు. మనం ప్రతిష్టింపజేసే విగ్రహాలు మట్టితో తయారుచేసిన విగ్రహాలకు పూజలు నిర్వహిస్తే పర్యావరణ పరిరక్షణ కు సహకరించిన వారం అవుతాము అని అన్నారు. రసాయనాలతో కూడిన విగ్రహాలను ప్రతిష్టింపజేసీ తొమ్మిది రోజులు విగ్రహాలకు పూజలు చేస్తే, ఆ విగ్రహాలను నుండి వచ్చే రసాయనాల వాసనకు అనారోగ్యానికి గురికావడం జరుగుతుంది అన్నారు. నిమజ్జన సమయంలో ఈ విగ్రహాలను నీటిలో వేయడం వలన నీరు కాలుష్యం అవుతుందని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యత అనుకోని, నవరాత్రులో మట్టితో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్టింపజేసి పూజలు నిర్వహిస్తే మనం ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. హిందూ సాంప్రదాయం గౌరవిస్తూ వినాయకుని ఆకారంతో ఉన్న విగ్రహాలను మాత్రమే పూజించాలని అన్నారు. మారుతున్న కాలం బట్టి వినాయకులకు రూపాలతో పాటు పేర్లు కూడా మారుతున్నాయి అని, ఈ మధ్యకాలంలో సినిమా పేర్లతో విగ్రహాలు మార్కెట్ లో ప్రత్యక్షమవుతున్నాయి అన్నారు. అలాంటి విగ్రహాలను పూజిస్తే మన సంప్రదాయ సంస్కృతిని కించపరిచిన వారము అవుతాము అని అన్నారు. ప్రతి ఒక్కరు నవరాత్రులలో డీజే లు పెట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా మన సంస్కృతి సాంప్రదాయలకు అనుకూలంగా భక్తి పాటలుతో భజనలతో పూజలు నిర్వహించాలని సురభి శ్రీధర్ తెలిపారు.

# బొంకూరి కైలాసం తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు

**-నీ చిట్టా విప్పుతాం**

**-దళిత జాతి కోసం అంకితభావంతో పనిచేస్తున్న బొంకూరి మధు పై ఆరోపణలా**

**ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం దళిత బహుజన అనగారిన వర్గాల కోసం పనిచేస్తుంది**




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ సెప్టెంబర్ 12 :** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా దళిత బహుజన అనగారిన వర్గాల కోసం అంకిత భావంతో పనిచేస్తున్న బొంకూరి మధు పై అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ రాష్ట్ర నాయకులు బొంకూరి కైలాసం ను హెచ్చరించారు, పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు కుర్మపల్లి మాజీ సర్పంచ్ మామిడిపల్లి బాపయ్య, జిల్లా అధ్యక్షులు మాజీ జెడ్పిటిసి లంక సదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్ లు పాల్గొని మాట్లాడారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘానికి రిజిస్ట్రేషన్ లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తూ అంతేకాకుండా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా దళిత జాతి కోసం అంకితభావంతో పనిచేస్తున్న బొంకూరి మధు పై లేనిపోని ఆరోపణలు చేస్తూ పెద్దపల్లి కి రావద్దంటూ బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు, అంబేద్కర్ భవనం కోసం ఒక వ్యక్తి వద్ద 30 లక్షల రూపాయలు తీసుకున్నట్లు చేస్తున్న ఆరోపణలో నిజం లేదని రెండు ఒరిజినల్ డాక్యుమెంట్లు అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ టేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోనే ఉన్నాయని అన్నారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రిజిస్ట్రేషన్ నెంబర్ 103/77, సర్టిఫికెట్లను విలేకరులకు చూపించారు, బొంకూరి కైలాసం ఆరోపణలను తీవ్రంగా ఖండించారు, 50 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆల్ ఇండియా, అంబేద్కర్ యువజన సంఘాన్ని నాయకులను అబ్బాస్ పాలు చేస్తున్న బొంకూరి కైలాసం తాను చేస్తున్న అక్రమాలపై చిట్టా విప్పుతామని హెచ్చరించారు, మహనీయులు అంటే ఎవరో తెలియని బొంకూరి కైలాసం మహనీయుల ఆశయ సాధన సంఘాన్ని అడ్డం పెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఉద్యోగాలు పెట్టిస్తానని గుండారం మహిళల నుండి డబ్బులు తీసుకున్నది మొదలుకొని ఇప్పటివరకు కొంతమంది ప్రజాప్రతి నిధుల పేర్లు చెప్పుకొని ఉద్యోగాలు పెట్టిస్తానని డబ్బులు తీసుకున్న చిట్టాను ఆధారాలతో వెల్లడిస్తామని అన్నారు, గోదావరిఖని పట్టణంలో ఓల్డా అశోక్ టాకీస్ వద్ద అడ్డకూలి తాపీ మేస్త్రిగా మొదలైన జీవితం సులభంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో దళిత నాయకునిగా అవతారం ఎత్తడని అన్నారు, మహనీయుల ఆశయ సాధన సంఘములో కూడా ఒక రాష్ట్ర కమిటీ గాని జిల్లా కమిటీ కానీ లేవని కేవలం ఆయా వర్గాలను బెదిరింపుల కోసం తాత్కాలికంగా కొంతమందికి ఆ పూటకు డబ్బులు ఇచ్చి ప్రెస్ మీట్ లో తనతోపాటు కూర్చుండ పెట్టుకుంటున్నారని ఆరోపించారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మరియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న బొంకూరి మధు పై చేస్తున్న ఆరోపణలో తీవ్రంగా ఖండించారు అసత్యపు ఆరోపణలు మానుకోకపోతే లీగల్ గా పోవలసి ఉంటుందని హెచ్చరించారు,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘంను మరియు బొంకూరి మదును కావల్సుకొని అభాష్పాలు చేస్తున్న బొంకూరి కైలాసం పై పెద్దపల్లి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టనున్నట్లు వారు వెల్లడించారు, ఈ విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపల్లి సతీష్ రాష్ట్ర కార్యదర్శి పాల రాజేశం, జిల్లా కోకన్వీనర్లు ఆకునూరి బాల అంకుష్ ఇంటి బిల్లి రవీంద్ర కుమార్,గొట్ట లింగయ్య, నక్క శంకర్ పొనుగంటి రాజనర్సు, బొచ్చు శంకర్, పొనుగంటి రాజలింగం, వివిధ మండలాల అధ్యక్షులు కాంపల్లి జీవన్ కుమార్, బొల్లి నందయ్య, నిర్భట్ల రాజయ్య, బొసెల్లి మహేష్, కుక్క అశోక్, ఉప్పులేటి పవన్ కుమార్, ప్రభాకర్, తో పాటు పలువురు పాల్గొన్నారు,



**బొంకూరి కైలాసం పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**

**పెద్దపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు,**

అసత్యపు ఆరోపణలు చేస్తున్న బొంకూరి కైలాసం పై పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్లో ఆల్ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు, పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై నరేష్ లకు బొంకూరి కైలాసం పై చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేశారు.

# ధర్మపురి ఆలయ నిర్మాణంలో స్మార్త ఆగమ సంప్రదాయం

## - శిల్పం, వాస్తు, పూజా విధానాల సమన్వయం

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...944059494



తెలంగాణ ఆధ్యాత్మిక చరిత్రలో ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి విశిష్టమైన స్థానం ఉంది. గోదావరి దక్షిణ తీరాన వెలసిన ఈ పుణ్యక్షేత్రం భక్తి, పురాణం, శిల్పకళ, ఆలయ వాస్తు, వేద సంప్రదాయం, ఆధ్యాత్మిక జీవన విధానాల సమ్మేళనంగా శతాబ్దాల చరిత్రను మోస్తోంది. ధర్మపురిని కేవలం ఒక నరసింహ క్షేత్రంగా మాత్రమే చూడటం దాని వైభవాన్ని పరిమితం చేయడమే అవుతుంది. ఇక్కడి ఆలయ నిర్మాణాల్లో కనిపించే రాతి స్తంభాలు, శిలా దూలాలు, మండప వ్యవస్థ, అధిష్ఠాన నిర్మాణం, విమాన--శిఖర రూపకల్పన వంటి అంశాలు దక్షిణ భారతీయ దేవాలయ నిర్మాణ సంప్రదాయాల పరిణామాన్ని మన కళ్లముందుంచుతాయి. ఆలయ వాస్తు ఒక అంశం కాగా, ఆగమ సంప్రదాయం, ప్రతిష్ఠా విధానం, నిత్యారాధనా క్రమం, ఉత్సవ వ్యవస్థ, అర్చక పరంపర మరో అంశం. ఈ రెండింటి మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని అర్థం చేసుకున్నప్పుడే ధర్మపురి క్షేత్ర ప్రత్యేకతను సమగ్రంగా గ్రహించగలం.ప్రాచీన ఆలయ నిర్మాణంలో ప్రతి రాయి ఒక నిశ్శబ్ద చరిత్ర. ధర్మపురి ఆలయ ప్రాంగణంలో కనిపించే రాతి స్తంభాలు, దూలాలు కేవలం భవనాన్ని మోసే నిర్మాణ భాగాలు కావు. వాటిలో శిల్పుల చేతివృత్తి, ఆనాటి నిర్మాణ పరిజ్ఞానం, కళాత్మక అభిరుచి, ధార్మిక భావనల ముద్ర కనిపిస్తుంది. గర్భగృహానికి ఎదురుగా ఏర్పడే మండపం భక్తుల సమూహారాధనకు, వేదపఠనానికి, ఉత్సవ కార్యక్రమాలకు, వివిధ సేవలకు అనుకూలంగా ఉండేలా ఆలయ నిర్మాణ సంప్రదాయంలో కీలక భాగంగా అభివృద్ధి చెందింది. స్తంభాల మధ్య దూరం, దూలల అమరిక, పైకప్పు నిర్మాణం, అధిష్ఠాన స్థాయి వంటి అంశాలు నిర్మాణ స్థిరత్వంతో పాటు ఆలయానికి ఒక ప్రత్యేకమైన దృశ్య సౌందర్యాన్ని అందిస్తాయి.దక్షిణ భారతీయ దేవాలయ వాస్తులో గర్భగృహం అత్యంత పవిత్రమైన కేంద్రము. అక్కడే మూలవిరాట్టు ప్రతిష్ఠితుడై ఉంటాడు. గర్భగృహానికి వెలుపల అంతరాళం, మండపం, ప్రాకారాలు, ప్రవేశ మార్గాలు వంటి నిర్మాణాలు ఒక క్రమంలో ఏర్పడతాయి. భక్తుడు బాహ్య ప్రపంచం నుంచి ఆలయంలోకి ప్రవేశించి క్రమంగా అంతర్గత పవిత్రత వైపు ప్రయాణించే విధంగా ఆలయ నిర్మాణం ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. అందుకే ఆలయ వాస్తును కేవలం రాళ్లతో నిర్మించిన భవన శాస్త్రంగా చూడలేం. అది భౌతిక నిర్మాణానికి ఆధ్యాత్మిక అర్థాన్ని జోడించిన భారతీయ మేధస్సు ప్రతిఫలం.ధర్మపురి క్షేత్రానికి మరో ప్రత్యేకత నరసింహారాధనలోని వైవిధ్యం. యోగ నరసింహస్వామి, ఉగ్ర నరసింహస్వామి రూపాలు క్షేత్ర ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. నరసింహారాధనలో భక్తి, శక్తి, రక్షణ, యోగతత్త్వం వంటి అనేక భావనలు అంతర్లీనంగా ఉంటాయి. అందువల్ల ఆలయంలోని విగ్రహ స్వరూపం, గర్భగృహ నిర్మాణం, ఆరాధనా విధానం, ఉత్సవ సంప్రదాయాలను పరస్పర సంబంధంతో పరిశీలించాల్సి ఉంటుంది.స్మార్త సంప్రదాయం విషయానికి వస్తే మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. 'స్మార్తం' అనేది కేవలం ఒక నిర్మాణ శైలి కాదు. వేద-స్మృతి సంప్రదాయాల ఆధారంగా అభివృద్ధి చెందిన విస్తృత ధార్మిక వ్యవస్థ. అందువల్ల ఏదైనా ఆలయంలో స్మార్త ఆచారాలు కొనసాగుతున్నాయని చెప్పడానికి అక్కడి పూజా క్రమం, అర్చక సంప్రదాయం, ఆగమ గ్రంథ అనుసరణ, ప్రతిష్ఠా విధానం, దేవస్థాన పత్రాలు వంటి ఆధారాలను కూడా పరిశీలించాలి.ధర్మపురి ఆలయ సంప్రదాయంలో వేదపఠనం, మంత్రోచ్చారణ, వైష్ణవ ఆరాధనా విధానాలు కొనసాగుతున్నాయని చెప్పబడుతున్న నేపథ్యంలో ఇక్కడ ఒక ఆసక్తికరమైన సమన్వయం కనిపిస్తుంది.వేద సంప్రదాయం,స్మార్త ఆచార ధోరణులు, వైష్ణవ అర్చనా పద్ధతులు పరస్పర విరోధకాలు కాకుండా ఒక క్షేత్ర ఆధ్యాత్మిక జీవనంలో భిన్న పార్శ్వాలుగా సహజీవనం చేయవచ్చు. భారతీయ దేవాలయ సంప్రదాయం యొక్క అసలు బలం కూడా ఈ సమన్వయంలోనే ఉంది.ఒకే ఆలయంలో వేదఘోష వినిపిస్తూనే,వైష్ణవ అర్చకులు స్వామి వారికి శాస్త్రోక్త సేవలు నిర్వహించడం భారతీయ ధార్మిక సంస్కృతిలోని సమగ్రతకు నిదర్శనం.పంచోపనిషత్ యుక్త వేదమంత్రాల పఠనం, అభిషేకాలు, నిత్యపూజలు, వైష్ణవ సంప్రదాయంలోని షోడశోపచార సేవలు వంటి ఆచారాలు ఆలయాన్ని కేవలం దర్శన స్థలంగా కాకుండా సజీవ ఆధ్యాత్మిక కేంద్రంగా నిలబెడతాయి. ఆలయం అంటే గర్భగృహంలో ఉన్న విగ్రహం మాత్రమే కాదు; దానిని చుట్టుముట్టి తరతరాలుగా కొనసాగుతున్న మంత్రం, తంత్రం, ఆచారం, ఉత్సవం, సంగీతం, వేదపఠనం, భక్తి, శిల్పం, సామాజిక జీవనం అన్నింటి సమాహారం.ఇక్కడి ప్రాచీన నిర్మాణాన్ని పరిశీలించినప్పుడు మరో ముఖ్యమైన అంశం గుర్తుంచుకోవాలి. కాలగమనంలో ఆలయాలకు మరమ్మతులు, పునర్నిర్మాణాలు, విస్తరణలు జరగడం సహజం. ఒక ఆలయంలోని ప్రతి రాయి ఒకే కాలానికి చెందినదని భావించడం చారిత్రకంగా సరైనది కాదు. కొన్ని భాగాలు ప్రాచీనమైనవై ఉండవచ్చు; మరికొన్ని తరువాతి కాలంలో పునరుద్ధరించబడి ఉండవచ్చు. అందువల్ల పురాతన నిర్మాణాన్ని కాపాడుతూ ఆధునిక అవసరాలకు అనుగుణంగా పునర్నిర్మాణం చేయాలంటే శిల్పశాస్త్రం, వాస్తుశాస్త్రం, ఆగమ సంప్రదాయం, పురావస్తు పరిరక్షణ ప్రమాణాలు అన్నింటినీ సమన్వయం చేయాలి. ప్రస్తుతం ఆలయాల పునర్నిర్మాణం జరుగుతున్న సమయంలో 'పాత రాళ్ల స్థానంలో కొత్త రాళ్లు పెట్టడం'మాత్రమే పునరుద్ధరణ కాదనే అవగాహన అవసరం. అసలు కర్తవ్యం ప్రాచీన నిర్మాణ భావనను, దాని ఆధ్యాత్మిక స్వరూపాన్ని, శిల్ప సంప్రదాయాన్ని, ఆరాధనా విధానాన్ని భవిష్యత్ తరాలకు అందించడం. నిర్మాణ మార్పులు అవసరమైనప్పుడు అవి ఆలయ మూల స్వరూపాన్ని దెబ్బతీయకుండా ఉండాలి. కొత్త నిర్మాణం భక్తుల సౌకర్యాన్ని పెంచినా, పాత నిర్మాణం యొక్క చారిత్రక గుర్తింపును చెరిపి వేయకూడదు. ధర్మపురి వంటి ప్రాచీన క్షేత్రాలకు ఇదే అసలు సవాలు. భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నిర్మాణాలు చేపట్టినా,అదే సమయంలో శతాబ్దాలు గా నిలిచిన ఆలయ శిల్ప వారసత్వాన్ని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత.అభివృద్ధి పేరుతో చరిత్రను తొలగించడం కాదు; చరిత్రను కాపాడుకుంటూనే అభివృద్ధిని సాధించడం సముచిత మార్గం.ధర్మపురి ఆలయ నిర్మాణంలోని రాతి స్తంభాలను చూస్తే శిల్పి చేతిలో రాయి ఎలా జీవం పొందిందో తెలుస్తుంది.మండపాన్ని చూస్తే సామూహిక ఆరాధనకు భారతీయ సమాజం ఇచ్చిన ప్రాధాన్యం అర్థమవుతుంది. గర్భగృహాన్ని చూస్తే భక్తి యొక్క అంతర్ముఖ ప్రయాణం గుర్తుకొస్తుంది. విమానాన్ని చూస్తే భౌతిక ప్రపంచం నుంచి దైవత్వం వైపు ఎదుగుతున్న ఆధ్యాత్మిక సంకేతం కనిపిస్తుంది. వేదఘోషను వింటే వేల సంవత్సరాల భారతీయ శ్రుతి సంప్రదాయం మనసును తాకుతుంది. అర్చనను చూస్తే ఆచార పరంపర తరతరాలకు ఎలా కొనసాగుతుందో తెలుస్తుంది. స్మార్త సంప్రదాయం, వైష్ణవ ఆరాధన, వేదపఠనం, శిల్పకళ, దక్షిణ భారతీయ ఆలయ వాస్తు-ఇవన్నీ తమ తమ పరిధిలో పరిశీలించినప్పుడే ఈ క్షేత్రం యొక్క బహుముఖ వైభవం స్పష్టమవుతుంది.కనిపించే రాతి స్తంభాలు, మండపాలు, అధిష్ఠానాలు, విమాన నిర్మాణం మనకు ఒక దృశ్య సాక్ష్యాన్ని అందిస్తున్నాయి; అయితే వాటి వెనుక ఉన్న ఆగమ పరంపరను నిర్ధారించడానికి శాస్త్రీయ, చారిత్రక, దేవస్థాన ఆధారాలు అవసరం.ధర్మపురి క్షేత్రం రాళ్లతో కట్టినఆలయం మాత్రమే కాదు... అది కాలంతో సంభాషిస్తున్న సంస్కృతి. గోదావరి ప్రవాహంలా నిరంతరం సాగుతున్న ఆధ్యాత్మిక పరంపర.శిల్పంలో చరిత్ర, వాస్తులో తత్త్వం,మంత్రంలో శక్తి, పూజలో భక్తి,సంప్రదాయంలో సమన్వయం-ఇవన్నీ కలిసినప్పుడే ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్ర మహిమ సంపూర్ణంగా అవగతమవుతుంది.ఈ వారసత్వాన్ని కాపాడటం ఒక ఆలయ పరిరక్షణ మాత్రమే కాదు;తెలంగాణ ఆధ్యాత్మిక-సాంస్కృతిక చరిత్రను భవిష్యత్ తరాలకు అప్పగించే పవిత్ర బాధ్యత.

